St 1 Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 3 సంచిక : 58 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 01 మార్చి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 58 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Sunday 01 March 2026 PAGES : 8 PRICE : 3/-

## ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా దాడులను ఖండించిన రష్యా

రష్యా విదేశాంగ మంత్రి లవ్రోవ్‌తో ఇరాన్ మంత్రి ఫోన్
ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశానికి ఇరాన్ డిమాండ్
దాడులు అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనేనన్న రష్యా
ఇరాన్‌లో మేజర్ కంబాట్ ఆపరేషన్స్ ధృవీకరించిన డొనాల్డ్ ట్రంప్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 28)
ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన సాయుధ దాడులను రష్యా తీవ్రంగా ఖండించింది. ఇవి ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండా చేసిన దాడులని, వెంటనే పరిస్థితిని చక్కదిద్ది రాజకీయ, దౌత్యపరమైన పరిష్కారం దిశగా అడుగులు వేయాలని రష్యా సూచించింది. ఈ మేరకు శనివారం రష్యా విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. శనివారం ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి.. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్‌కు ఫోన్ చేసి తాజా పరిస్థితులను వివరించారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులను తిప్పికొట్టేందుకు ఇరాన్ తీసుకుంటున్న చర్యలను ఆయన లవ్రోవ్‌కు తెలిపారు. శాంతియుత చర్చలకు ఈ దాడులు విఘాతం కలిగించాయని, దీనిపై అత్యవసరంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు ఇరాన్ మంత్రి పేర్కొన్నారు. దీనిపై స్పందించిన లవ్రోవ్.. ఇరాన్‌పై జరిగిన దాడులు అంతర్జాతీయ చట్టాలను, నిబంధనలను ఉల్లంఘించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు ప్రాంతీయ, ప్రపంచ భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులను తక్షణమే నిలిపివేయాలని కోరారు. ఐక్యరాజ్యసమితి వేదికగా శాంతియుత పరిష్కారాల కోసం రష్యా తన వంతు సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. మరోవైపు, ఇరాన్‌లో 'మేజర్ కంబాట్ ఆపరేషన్స్' (భారీ స్థాయి పోరాట చర్యలు) ▶మిగతా 2లో

## దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్.. ప్రారంభించిన ప్రధాని మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 28)
దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభమైంది. శనివారం రాజస్థాన్‌లో అజ్మేర్‌లో ప్రధాని నరేంద్రమోదీ దీనిని ప్రారంభించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులోభాగంగా 14 సంవత్సరాల బాలికలకు 'గార్డాసిల్' అనే ▶మిగతా 2లో

## బొత్సకు అస్వస్థత.. హైదరాబాద్‌లో వైద్య పరీక్షలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 28)
శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ శుక్రవారం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గురువారం సాయంత్రం కొంచెం నీరసంతోపాటు ఎడమ చేయి లాగినట్లుగా కొంత ఇబ్బంది రావడంతో ఆయన హైదరాబాద్‌లోని న్యూరాలజీ వైద్యుడితో ఫోన్‌లో ▶మిగతా 2లో

# ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వవైభవం తీసుకువస్తాం

- ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలపై మంత్రి లోకేష్ సమీక్ష
- ఏయూని ప్రపంచస్థాయిలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మార్చడమే లక్ష్యం
- మార్చి 26 నుంచి ఏప్రిల్ 26 వరకు పూర్వ విద్యార్థులతో వేడుకలు
- యూనివర్సిటీ వందేళ్ల విజన్‌కు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 28)
చారిత్రక నేపథ్యం కలిగిన ఆంధ్ర యూనివర్సిటీకి (ఏయూ) పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా కృషి చేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలను చరిత్రలో నిలిచిపోయేలా, కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై వర్సిటీ వైస్ ఛాన్స్ లర్ (వీసీ) ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి లోకేశ్ విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆంధ్ర యూనివర్సిటీకి దశాబ్దాల ఘన చరిత్ర ఉందని గుర్తుచేశారు. ఈ యూనివర్సిటీని ప్రపంచంలోనే మేటి విద్యాసంస్థగా, 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'గా తీర్చిదిద్దేందుకు ఈ శతాబ్ది ఉత్సవాలు ఒక వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. మార్చి 26 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు నెల రోజుల పాటు ▶మిగతా 2లో

## వేట్లపాలెంలో పేలుడు.. సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి




(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 28)
కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా కేంద్రంలో సంభవించిన పేలుడు ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. పేలుడు ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చంద్రబాబు తెలిపారు.

**వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచండి: పవన్ కల్యాణ్**

పేలుడు ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. " ఈ దురదృష్టకర ఘటన గురించి తెలియగానే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నాను. ▶మిగతా 2లో

## తప్పు చేసిన వారెవరూ తప్పించుకోలేరు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 28)
వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇళ్ల స్థలాలకు భూ సేకరణ, ఇంటి నిర్మాణంలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతోందని, చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని, ఎవరూ తప్పించుకోలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అప్పట్లో ఇసుక విధానాన్ని దుర్వినియోగం చేశారని, దీనిపై కూడా విచారణ జరుగుతోందని, తప్పు చేసిన వారిపై చర్యలుంటాయని తెలిపారు. గృహనిర్మాణశాఖ బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే 3 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించాం. ఉగాదికి రెండు రోజుల ముందు మరో 3 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తాం. ▶మిగతా 2లో

## కాకినాడ జిల్లా బాణాసంచా పేలుడు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి



వేట్లపాలెం బాణాసంచా పేలుడు ఘటనపై జగన్ స్పందన
ప్రమాదంలో పలువురు మృతి చెందడంపై ఆవేదన
మృతుల కుటుంబాలకు అండగా నిలవాలని ప్రభుత్వానికి సూచన
గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 28)
కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న భారీ పేలుడు ఘటనపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పందించారు. ▶మిగతా 2లో

## వేట్లపాలెంలో విస్ఫోటనం తీవ్ర దిగ్భ్రాంతికరం: పవన్ కల్యాణ్

మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన పవన్ కల్యాణ్
బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న ఉప ముఖ్యమంత్రి
పేలుళ్లకు కారణాలపై విచారణ జరుపుతున్నట్లు వెల్లడి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 28)
కాకినాడ జిల్లాలో బాణసంచా పరిశ్రమలో పేలుడు జరిగి 21 మంది మరణించిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వేట్లపాలెం వద్ద జరిగిన ఈ పేలుడు ఘటనలో పలువురు మృతి చెందారని తెలిసి ఆవేదనకు గురయ్యానని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

ఈ దుర్ఘటన గురించి తెలియగానే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. కలెక్టర్, ఎస్పీ ఘటన స్థలంలో ఉండి పరిస్థితిని, సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ, క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బాణాసంచా తయారీ పరిశ్రమ వద్ద ఇంకా పేలుళ్లు చోటుచేసుకుంటున్నట్టు అధికారులు తెలియజేశారని, పేలుళ్లకు కారణాలపై విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. ▶మిగతా 2లో

## కాకినాడ జిల్లా బాణసంచా పేలుడుపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి...

### రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

కాకినాడ ఘటన దురదృష్టకరమన్న ప్రధాని మోదీ
బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామని వెల్లడి
గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున సాయం ప్రకటన
బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 28)
ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లాలో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఓ బాణసంచా తయారీ కర్మాగారంలో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడు ఘటనలో ప్రాణనష్టం సంభవించడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ▶మిగతా 2లో

## సామర్లకోట బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు..

### 21 మంది మృతి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 28)
కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలంలోని బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు (ఝుఝితీశ్రీఝుఎశ్ఝు దీశ్రీఝర్ చీవఙం) సంభవించింది. మండలంలోని వేట్లపాలెం పరిధి గోదావరి కెనాల్ పక్కన ఉన్న సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. భారీ ఎత్తున మంటలు ఎగసిపడడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. పేలుడు శబ్దాలు సుమారు 5 కిలోమీటర్ల మేర వినిపించాయని స్థానికులు తెలిపారు. శబ్దం తీవ్రతకు పక్క గ్రామంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో శ్లాబ్‌కు పగుళ్లు వచ్చాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



2 ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో మొత్తం 34మంది పనిచేస్తున్నారు. వీరిలో 21మంది మృతి చెందగా 13మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో 9మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నట్లు సమాచారం. బాణసంచా పరిశ్రమను ▶మిగతా 2లో

# ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వవైభవం తీసుకువస్తాం

జరగనున్న ఈ ఉత్సవాల్లో పూర్వ విద్యార్థులను (అల్యూమిని) విస్తృతంగా భాగస్వాములను చేయాలని సూచించారు. వారి అనుభవాలు, విజయాలు ప్రస్తుత తరానికి స్ఫూర్తినిచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో ఏయూ ఘన చరిత్ర ప్రతిబింబించేలా అన్ని చర్యలు తీసుకోవాలని, దీనికోసం నియమించిన వివిధ కమిటీల మధ్య సమన్వయం ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. మీడియా పబ్లిసిటీకి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ప్రస్తుత విద్యార్థులతో కళలు, సంగీతం, సాహిత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను వినూత్నంగా రూపొందించాలని చెప్పారు. ఈ ప్రక్రియలో విద్యార్థుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కేవలం యూనివర్సిటీకే పరిమితం కాకుండా, ఉత్తరాంధ్ర ప్రజలను, విద్యార్థులను కూడా ఈ వేడుకల్లో భాగస్వాములను చేయాలని లోకేష్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులతో వివిధ అంశాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించడంతో పాటు, యూనివర్సిటీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాబోయే వందేళ్ల విజన్‌కు తగిన 'యాక్షన్ ప్లాన్'ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో భాగంగా వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వర్సిటీలో చేపట్టబోయే అభివృద్ధి పనులు, ఏప్రిల్ 26న జరిగే శతాబ్ది స్థాపన దినోత్సవ అజెండాను మంత్రికి వివరించారు. అనుబంధ కళాశాలలను కూడా ఉత్సవాల్లో కలుపుకుని వెళతామని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, యూనివర్సిటీతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ ఉత్సవాల్లో భాగం చేయాలని, దీనిద్వారా విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపు (విజిబిలిటీ) తీసుకురావాలని సూచించారు. శతాబ్ది ఉత్సవాల నిర్వహణ ఒక అద్భుత అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు.

ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు (గణబాబు), విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బొత్సకు అస్వస్థత.. హైదరాబాద్‌లో వైద్య పరీక్షలు

మాట్లాడి ఆయన సూచన మేరకు హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. శుక్రవారం తెల్లవారుఝామున 2 గంటల సమయంలో ఆసుపత్రికి చేరుకున్నారు. వెంటనే వైద్యులు ఆయనకు పలు పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం బొత్స శాసనమండలికి రాకపోవడంతో ఆయన ఆరోగ్యం గురించి పలువురు సభ్యులు అసెంబ్లీ లాబీల్లో చర్చించుకున్నారు.

మీడియాలో వస్తున్న వార్తలపై బొత్స స్పందించారు. తన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎవరూ కంగారు పడవద్దని అన్నారు. ఆయన గుండెకు 2012లో శస్త్ర చికిత్స జరిగింది. అప్పటి నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నా గతేడాది జూన్ 4న చీపురుపల్లిలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయారు. హైదరాబాద్ వెళ్లి మూడు నెలల పాటు విశ్రాంతి తీసుకున్నారు. తాజాగా మరోసారి ఆసుపత్రిలో చేరడంతో బొత్స మేనల్లుడు, విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు శుక్రవారం హైదరాబాద్ వెళ్లి పరామర్శించారు. ఆయన కోలుకుంటున్నారని, ఆందోళన అవసరం లేదని చెప్పారు.

**బొత్స వేగంగా కోలుకోవాలి: లోకేశ్**

ఈనాడు, అమరావతి: వైకాపా నేత బొత్స సత్యనారాయణ వేగంగా కోలుకోవాలని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. సంపూర్ణ ఆరోగ్యం, పూర్తి శక్తితో ఆయన మళ్లీ తిరిగి రావాలని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

# సామర్లకోట బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు..

అడపా నాని కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పరిమితికి మించి బాణసంచా తయారు చేయడం వల్లే ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.

**భారీ విస్ఫోటం**

పేలుడు సంభవించినప్పుడు భారీ శబ్దం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు ధాటికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగలు అలముకున్నాయి. పేలుడు సంభవించే ప్రాంతానికి స్థానికులు చేరుకున్నప్పటికే అందులో చిక్కుకున్న పలువురు అగ్నికి ఆహుతయ్యారు. ఘటనాస్థలిలో

## మొదటి పేజీ తరువాయి

శరీరభాగాలు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి.

**ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా**

ప్రస్తుతం విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు పేలుడు ఘటనపై ఆరా తీశారు. అక్కడి పరిస్థితులను అధికారులు ఆయనకు వివరించారు. తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఘటనాస్థలికి వెళ్లాలని హోం మంత్రి అనితకు సూచించారు. ఈ మేరకు హోం మంత్రి అనిత అక్కడికి బయల్దేరారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ, కలెక్టర్ సంఘటన స్థలికి చేరుకొని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు.

**మృతులు వీళ్లే..**

మృతుల్లో ఇప్పటి వరకు 11 మంది మృతదేహాలను పోలీసులు గుర్తించారు. మృతులను అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నానిగా పోలీసులు పేర్కొన్నారు. ఇంకా కొద్ది మంది మృతదేహాలను గుర్తించాల్సి ఉంది.

# దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్.. ప్రారంభించిన ప్రధాని మోదీ

టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్‌పీవీ టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పించనున్నట్లు కేంద్రం తెలిపింది. గర్భాశయ క్యాన్సర్ నివారణకు ప్రపంచస్థాయి వ్యూహంలో భాగంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేపట్టాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) చేసిన సిఫార్సు మేరకు కేంద్రం దీనిని ప్రారంభించింది. ప్రతి ఏటా 1.15 కోట్ల వ్యాక్సిన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆరోగ్యశాఖ వెల్లడించింది.

ఈ వ్యాక్సిన్ 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 50 కోట్ల డోసులు పంపిణీ చేశారు. దీంతో పలు దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్లు అంచనా. 160 దేశాల్లో ఇప్పటికే ఈ టీకా పంపిణీ కార్యక్రమం అమల్లో ఉండగా.. వీటిలో 90 దేశాలు సింగిల్ డోసులు అందిస్తున్నాయి. ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్యాపరంగా చైనా, అమెరికా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. 2040 నాటికి దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏటా 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. వీరిలో 15 లక్షల మంది భారతీయులే ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

# తప్పు చేసిన వారెవరూ తప్పించుకోలేరు

జూన్ నాటికి 2.50 లక్షలు, సెప్టెంబరు నాటికి 2.10 లక్షలు పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహిస్తాం. ఇప్పటికే సొంతింటి కోసం 7 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలి. అర్హులందరికీ ఇళ్లు నిర్మించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది' అని వివరించారు.

**స్థలాల లభ్యత లేని చోట జీ౦2 తరహాలో నిర్మాణం**

2029 నాటికి అర్హులందరికీ ఇళ్ల స్థలాలిస్తాం. అర్హుల ఎంపిక ప్రారంభించాం. 2.20 లక్ష మందికి ఇంటి స్థలాలు లేనట్లు దరఖాస్తు చేసుకున్నాం. వారందరికీ అందిస్తాం. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 3 సెంట్లు ఇస్తాం. స్థలాల లభ్యత లేని చోట జీ౦2 తరహాలో నిర్మాణాలు చేపడతాం' అని పేర్కొన్నారు.

**త్వరలోనే రూ.913 కోట్లు విడుదల**

2014–19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో ఇంటి నిర్మాణం చేపట్టారనే కక్షతో వైకాపా ప్రభుత్వం 2.70 లక్షల మందికి సంబంధించి వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు రూ.913 కోట్లు చెల్లించకుండా ఇబ్బంది పెట్టారు. త్వరలోనే వారికి సాయం చేస్తాం' అని సీఎం వివరించారు.

# కాకినాడ జిల్లా బాణాసంచా పేలుడు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన విచారాన్ని తెలియజేశారు. ప్రమాదంలో కార్మికులు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇటువంటి విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే, ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం ప్రకటించాలని జగన్ డిమాండ్ చేశారు. పేలుడు ధాటికి గాయపడిన వారికి వెంటనే మెరుగైన వైద్య సహాయం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

# వేట్లపాలెంలో విస్ఫోటనం తీవ్ర దిగ్భ్రాంతికరం: పవన్ కల్యాణ్

బాణాసంచా పరిశ్రమలపై అధికారులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని, భద్రత చర్యలను తనిఖీ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. పరిసర గ్రామాలకు పొగ అలుముకున్న క్రమంలో ఆయా గ్రామాల ప్రజలకి ధైర్యం చెప్పి, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం, బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పడానికి మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లను ఘటనాస్థలానికి పంపించినట్లు తెలిపారు.

## కాకినాడ జిల్లా బాణసంచా పేలుడుపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి...

ఈ ఘటన తనను ఎంతగానో కలచివేసిందని పేర్కొన్నారు.

ఈ మేరకు ప్రధాని మోదీ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. “కాకినాడ జిల్లాలోని బాణసంచా కర్మాగారంలో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడులో ప్రాణనష్టం సంభవించడం చాలా బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు మరియు వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను” అని ప్రధాని పేర్కొన్నారు. అలాగే ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తరపున ఆర్థిక సాయాన్ని కూడా ప్రధాని ప్రకటించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే ప్రమాదంలో గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రధాని తెలిపారు.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా దాడులను ఖండించిన రష్యా

ప్రారంభించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధృవీకరించారు. కాగా, తాము అమెరికాతో దౌత్యపరమైన చర్చల్లో ఉండగానే ఈ దాడులు జరిగాయని ఇరాన్ విదేశాంగ శాఖ ఆరోపించింది. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ వెంటనే స్పందించి ఈ దురాక్రమణను అడ్డుకోవాలని ఇరాన్ డిమాండ్ చేసింది.

# వేట్లపాలెంలో పేలుడు.. సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలంలో ఉంటూ పరిస్థితిని, సహాయక చర్యలను పర్యవేక్షించారు. పేలుళ్లకు గల కారణాలపై విచారణ జరుగుతోంది. పరిసర గ్రామాలకు పొగ వ్యాపించిన క్రమంలో ఆయా గ్రామాల ప్రజలకు ధైర్యం చెప్పి, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని చెప్పాను. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లను ఘటన స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని దిశా నిర్దేశం చేశాను” అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

**మెరుగైన వైద్యం అందించండి: అనిత**

బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. కార్మికుల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో సీఎం పర్యటన సందర్భంగా అక్కడ ఉన్న ఆమె.. హుటాహుటీన సంఘటన స్థలికి బయల్దేరి వెళ్లారు. కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఎప్పటికప్పుడు మాట్లాడి ఘటనపై ఆరా తీశారు.

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సమాచారం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. పలువురు మృత్యువాత పడటం మాటలకు అందని విషాదం. మృతులకు నివాళులు అర్పిస్తున్నాను. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తాం –మంత్రి నారా లోకేశ్

**బాధితులకు అండగా ఉంటాం: మంత్రి నారాయణ**


పేలుడు ఘటనపై ఇంఛార్జి మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అత్యవసర చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఘటనాస్థలికి వైద్యులను పంపించి తక్షణ వైద్యసాయం అందించాలని ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

# ఆర్థిక లోటున్నా ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్ పంపిణీ

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి









(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 28) రాష్ట్రం ఆర్థిక లోటులో ఉన్నా పేదలకు ఇచ్చిన మాటకు కట్టుబడి విడతల వారీగా కాకుండా ఒకే సారి చెప్పిన ప్రకారం రూ.4000 పెన్షన్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని గోగినేనివారిపాలెం గ్రామంలో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన శనివారం పాల్గొన్నారు. పెన్షన్‌ల పంపిణీ అనంతరం ఆయన గోగినేనివారిపాలెంలో రూ.18 లక్షలతో అంతర్గత సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం వెయ్యి రూపాయల పెన్షన్ పెంచడానికి ఐదు సంవత్సరాల సమయం తీసుకుందని, కానీ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం వచ్చిన మరుసటి నెలలోనే వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానిదని అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, అందుకే ఒకటవ తేదీకి ఒక రోజు ముందే పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవంను జయప్రదం చేయాలి

## వనిత క్లబ్ అధ్యక్షురాలు చాటకొండు కోటేశ్వరమ్మ


(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 28)



బద్వేల్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో మార్చి ఒకటో తారీఖున ఆదివారం మహిళా దినోత్సవ పురస్కరించుకొని ముందస్తుగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాలు మేరకు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని వనితా క్లబ్ అధ్యక్షురాలు చాటకొండు కోటేశ్వరమ్మ, సెక్రటరీ బొగ్గరపు వెంకటసుబ్బమ్మ, ట్రెజరర్ బచ్చు పార్వతమ్మ, వాసవి క్లబ్ అధ్యక్షులు భూపాలం రాఘవేంద్రరావు, సెక్రటరీ చిందుకూరు వెంకటరమణ, ట్రెజరర్ బైసాని సుమంత్, తో పాటు పలువురు తెలిపారు, ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల మేరకు ఈనెల 1,వ తారీఖున మహిళా దినోత్సవం పురస్కరించుకొని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని వారు తెలిపారు, కాంపిటేషన్ మరియు పలువురు మహిళలకు గేమ్స్ నిర్వహించి విన్నర్స్ కి మొదటి రెండు మూడవ ఆకర్షమైన బహుమతులను ఇవ్వడం జరుగుతుందన్నారు, అలాగే వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి గురించి వివరించడం, ప్రస్తుత కాలాన్ని పరిస్థితులు అనుకూలించి అబ్బాయిలకు కానీ అమ్మాయిలకు కానీ జరుగు ఆలస్య వివాహాలను గురించి మాట్లాడడం, యువతలు తమ తల్లిదండ్రులని ఎలా చూసుకోవాలి అనే విషయాలపై పూర్తిస్థాయిలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు, ఈ కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ అల్పాహారం మరియు మధ్యాహ్నం భోజనం కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని కావున బద్వేల్ పట్టణ పరిసర ప్రాంత ఆర్యవైశ్యులందరు కూడా మహిళా దినోత్సవ వేడుకలలో పాల్గొని జరగబోవు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పలువురికి పిలుపునిచ్చారు.

**కెవి సుబ్బారావు స్వగృహంలో క్యాబినెట్ సమావేశం**

శుక్రవారం సాయంత్రం మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కే,వీ సుబ్బారావు స్వగృహంలో ప్రత్యేక డిస్టిక్ వి 206 ఏ మొదటి క్యాబినెట్ మీటింగ్ సమావేశాన్ని నిర్వహించి మహిళా దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని అనంతరం పలు విషయాల గురించి పలువురితో చర్చించడం జరిగింది, ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య మహిళా మండలి స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, వనిత క్లబ్ చార్టెడ్ అధ్యక్షురాలు పత్తి హేమలత, మాజీ వనిత క్లబ్ అధ్యక్షురాలు అక్కిశెట్టి జ్యోతిర్మయి, జోన్ చైర్మన్ చింతకుంట ధనలక్ష్మి, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ మేధాహాల్ భార్గవ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

01.03.26 ఆదివారం


# ఒంగోలు ప్రజలు ఐదు సార్లు గెలిపిస్తే నీవెక్కడ

**మూడు నెలలకు ఒకసారి రాకుమారుడు లా**
**ఒంగోలు వచ్చి తప్పుడు ప్రకటనలు ఇచ్చి గంటలో పారిపోతావ్**
**ఒంగోలు అభివృద్ధి పై మీ అనుచరులతో తప్పుడు లేఖలు**
**మా ఇంటిలోని మహిళలను సైతం తప్పుడు ప్రచారాల్లోకి లాగుతారా**
**ఒంగోలు గంజాయి అడ్డాలా నిలిచింది నీ హయాంలోనే**
**మైండ్ డైవర్ట్ రాజకీయాలు చేయవద్దు**
**నీ గురించి తెలియక పవన్ కళ్యాణ్ పార్టీలో చేర్చుకున్నారు**
**తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుంది**
**మాజీ మంత్రి బాలినేని పై ఎమ్మెల్యే దామచర్ల ఫైర్**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 28)**
ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఒంగోలు ప్రజల మధ్యన లేకుండా హైదరాబాదులో ఎందుకు ఉంటున్నావని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పై ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఫైర్ అయ్యారు. ఒంగోలులోని తన నివాసంలో దామచర్ల జనార్ధన్‌రావు శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిపించిన ఒంగోలు ప్రజల మధ్య లేకుండా, ప్రజా సమస్యలు తెలుసుకోకుండా, మూడు నెలలకు ఒకసారి రాకుమారుడులా వచ్చి కార్యకర్తలు అందించే స్లిప్పులను చదివి, వాస్తవాలు తెలుసుకోకుండా గంటలో తిరిగి హైదరాబాద్ పారిపోయే నీకు ఒంగోలులో జరుగుతున్న అభివృద్ధి పై ప్రశ్నించే హక్కు లేదని ధ్వజమెత్తారు. నీ అనుచరులతో ఇప్పటికి మూడు పర్యాయాలు తప్పుడు లెటర్లు కొరియర్ చేయించావన్నారు. వాస్తవాలు బయటకు వచ్చాయన్నారు. హేమలత అనే హిందూ యువతిచే బురఖా వేయించి పైసల్ అనే



వ్యక్తి చేత తప్పుడు లెటర్లు విజయవాడ నుంచి కొరియర్ చేయించావని మాకు తెలుసన్నారు. వీటిని బొమ్మినేని మురళి,

ఫైరోజ్ అనే వ్యక్తుల చేత అద్దంకిలో ఒక టైపిస్ట్ దగ్గర తయారు చేయించినట్లు పోలీసులు తేల్చారన్నారు. వారిని కొట్టవద్దంటూ హైదరాబాదు నుండి కిషన్‌రెడ్డి ద్వారా ఫోన్ చేయించావన్నారు. వారిని హైదరాబాదులో నీ సంరక్షణలోనే ఉంచుకున్నావన్నారు. అసలు ఎందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నావో చెప్పాలన్నారు. తప్పుడు ప్రచారంలో మా ఇంటిలోని మహిళలను కూడా ఎందుకు లాగుతున్నావో చెప్పాలన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో ఒంగోలులో భూ కబ్జాలు జరిగాయన్నారు. గంజాయి బ్యాచ్‌లు విచ్చలవిడిగా తిరిగాయన్నారు. మహిళలు ఇంటి నుండి బయటకు వచ్చేందుకు భయపడ్డారన్నారు. అయితే ప్రస్తుతం ఒంగోలులో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. ఎవరి వ్యాపారాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసుకుంటున్నారన్నారు. బాలినేని, అతని కుమారుడు ఒంగోలులో చేయని అరాచకాలు లేవన్నారు. రిమ్స్ వైద్యశాలలో హాస్పిటల్ తలుపులు బద్దలు కొట్టి మహిళల పై దాడులు చేయలేదా అని ప్రశ్నించారు. ఒంగోలు నగరం గత రెండు సంవత్సరాల కాలంలో ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఒంగోలు నగర పరిధిలో రూ.77.41 కోట్ల నిధులతో 621 పనులు చేపట్టామన్నారు. ఒంగోలులో సిసి రోడ్లు, డ్రైన్లు, పార్కులు, ప్లాంటేషన్, ఊర చెరువు, రంగారాయుడు చెరువు,

## లడ్డు రాజకీయాలను ఆపి ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

**ప్రజా సమస్యలపై దృష్టి మళ్లించేందుకు**
**కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు**
**నిధులు ఇవ్వకుండా వెలుగొండ ప్రాజెక్టు**
**సందర్శనలు ఎందుకు**
**మార్చి 1 నుండి 15 వరకు ఇంటింటికి సిపిఐ**
**24న ఇళ్ల స్థలాల సాధన కై సచివాలయాలు,**
**తహసిల్దార్ కార్యాలయాలు,**
**కలెక్టరేట్‌ల ఎదుట సిపిఐ ధర్నాలు**
**మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 28)**
తిరుమల లడ్డు కల్తీ వ్యవహారాన్ని పక్కన పెట్టి ఇప్పటికైనా రాష్ట్రంలోని ప్రజా సమస్యలపై దృష్టి సాధించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుల భాగంగా ఒంగోలులో నిర్వహించిన డ్రగ్ మాఫియా, మెడికల్ మాఫియా, కార్పొరేట్ వైద్య శాలల దోపిడీలకు నిరసనగా సిపిఐ ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు గుజ్జుల ఈశ్వరయ్య శనివారం ఒంగోలు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక మల్లయ్య లింగం భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తిరుమల లడ్డు కల్తీ విషయంలో అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శ ప్రతి విమర్శలు చేసుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో కల్తీ లేని ఆహారం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కల్తీ లడ్డు విషయం చివరకు ప్రజాస్వామ్యాన్ని గౌరవించలేని స్థితిలో, చట్టాన్ని వారి చెప్పు చేతుల్లో తీసుకొని భౌతిక దాడులకు దిగే స్థితికి దిగజారి పోతున్నాయి అన్నారు. లడ్డులో కల్తీ జరిగి ఉంటే ఎప్పుడు జరిగిందో, ఎలా జరిగిందో, ఏ ల్యాబ్‌లో నిర్ధారణ జరిగిందో, నిర్ధారణ అయిన తర్వాత దోషులను శిక్షించేలా నిర్ణయాలు జరగాలన్నారు. అలాకాకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసం అధికార పార్టీ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. ప్రతిపక్ష పార్టీ కూడా ఇందులో ఇరుక్కుపోయింది అన్నారు. కల్తీ వ్యవహారం మొత్తం కేవలం ఒక మతంపల్లిలో జరిగిందని చెప్పుకునేలా తీవ్రస్థాయిలో ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా లడ్డు వ్యవహారాన్ని పక్కనపెట్టి ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సాధించాలని హితావు పలికారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర వాటాను సక్రమంగా కేటాయించలేదన్నారు. ప్రజలు దాని వైపు దృష్టి మళ్లించకుండా డైవర్షన్ రాజకీయాలకు కూటమి ప్రభుత్వం పాల్పడుతుందన్నారు. నిధులు ఇవ్వకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,

## జిల్లా వాసికి కేంద్ర ప్రభుత్వ పురస్కారం

**ఇంటలిజెన్స్ సిఐ శ్రీరామ్‌కు పలువురు అభినందనలు**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 28)**
పోలీస్ శాఖకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అందజేసే ప్రతిష్టాత్మక అతి ఉత్కృష్ట సేవా పథకం జిల్లావాసికి లభించింది. జిల్లాలోని సోమశిల కు చెందిన వేలమూరి శ్రీరామ్ కేంద్ర ప్రభుత్వానికి చెందిన మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ ఫర్ ది ఔట్ స్టాండింగ్ ఇన్ ఇంటలిజెన్స్ ఇన్ 2025 పురస్కారం సాధించారు. ప్రకాశం జిల్లా ఇంటెలిజెన్స్ విభాగంలో ఆర్ఐఓ, జోనల్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న శ్రీరామ్ పోలీస్ శాఖలోనే కానిస్టేబుల్‌గా పని చేసిన కృష్ణమూర్తి, వరలక్ష్మ కుమారుడు. కలువాయి, సోమశిల, నెల్లూరులలో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన కానిస్టేబుల్‌గా ప్రస్థానం మొదలుపెట్టారు. గ్రేహౌండ్స్‌లో ప్రతిభ చూపి సివిల్ ఎస్ఐగా ఎంపికైన శ్రీరామ్ ప్రకాశం జిల్లాలోని దోర్నాల, మార్టూరు, కందుకూరు, చీరాల రూరల్, చీమకుర్తి తదితర ప్రాంతాలలో పనిచేశారు. సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన ఆయన పొదిలి, దర్శి, కందుకూరు, తదితర ప్రాంతాలతో పాటు ప్రకాశం జిల్లాలో విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాల్లో పనిచేశారు. రాష్ట్రస్థాయిలో సంచలనం సృష్టించిన పలు కేసులను పరిష్కరించిన శ్రీరామ్ ప్రతిష్టాత్మకమైన కేంద్ర ప్రభుత్వ పురస్కారానికి ఎంపిక కావడం పై సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ఆయనకు తన తోటి సిబ్బంది, అభిమానులు, స్నేహితులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 28)**
ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. శనివారం బస్టాండును ఆయన పరిశీలించారు. ప్రాంగణం మొత్తం కలియతిరిగి అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. ఈ బస్టాండుకు ఉన్న రద్దీ, టాయిలెట్ల ఏర్పాటు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు పార్కింగ్ సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం కావడంతో ఆ స్థాయికి తగినట్లుగా అవసరమైన టాయిలెట్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. దీనితోపాటు పార్కింగ్, పారిశుద్ధ్యంపై మరింత దృష్టి సారించాలన్నారు. ఈ దిశగా వారం రోజుల్లోగా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నెల రోజుల్లోగా గణనీయమైన మార్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఆర్టీసీ ఆర్ఎం సత్యనారాయణ, డిఎం శ్రీనివాసరావు, ట్రాఫిక్ సూపర్వైజర్ ఫణి కుమార్, ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసిల్దార్ మధుసూదన్, ఇతర అధికారులు ఉన్నారు.



# పేదల సంక్షేమమే చంద్రన్న లక్ష్యం

**ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**
**ఒకరోజు ముందుగానే రాష్ట్రంలో పెన్షన్ పండగ**
**లక్కవరం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా**
**ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే ఏలూరి ఆకస్మిక తనిఖీ**
**ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసుకోవాలి**
**పంచాయతీ కార్యాలయం, సిసి రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే**

**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఫిబ్రవరి 28)**
పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని మార్చి 1 ఆదివారం రావడంతో, ఒకరోజు ముందుగానే శనివారం నిర్వహించడం ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని తెలిపారు. మార్టూరు మండలం లక్కవరం గ్రామంలో జరిగిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి స్వయంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడి పెన్షన్ ద్వారా వారికి కలిగే ప్రయోజనాలను తెలుసుకున్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా పెన్షన్ పంపిణీలో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందన్నారు. లక్కవరం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసే గ్రామ అభ్యున్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు.

**50 ఏళ్ల విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం...**
లక్కవరం గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నెలకు తాకే విద్యుత్ లైన్లు, వంగిన స్తంభాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దీనిపై దృష్టి సారించి రూ.75 లక్షల వ్యయంతో 195 కొత్త కరెంటు స్తంభాలు, కొత్త వైరింగ్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. అదనంగా 100 వాట్స్ సామర్థ్యం గల 2 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను కూడా ఏర్పాటు చేసి గ్రామానికి నూతన కాంతులు తెచ్చామని చెప్పారు.


**ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం...**
గ్రామంలో ఆర్డీఎస్ స్కీం కింద ఏర్పాటు చేసిన నూతన స్తంభాలు ట్రాన్స్ఫార్మర్ ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. మీరు అడగకుండానే విద్యుత్ సమస్యలను పరిష్కరించాం. ఇది మా బాధ్యతగా భావించి త్వరగా పూర్తి చేశాం” అని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్ తీసుకోవాలని, భవిష్యత్తులో ప్రతి ఇంటికి సోలార్ కనెక్షన్ అందించే లక్ష్యంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.

**అభివృద్ధి పనులకు శ్రీకారం...**
గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రూ.32 లక్షలతో నిర్మాణం జరుగుతున్న నూతన పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి భవనం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు.

**పాఠశాల ఆకస్మిక తనిఖీ...**
గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, (తరువాయి 4లో...)



# అంబటిని కలిసిన ఎమ్మెల్యే తాటిపర్తి



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 28)
టీడీపీ ప్రభుత్వ అక్రమ కేసుల అరెస్టు నుండి విడుదల అయిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి అంబటి రాంబాబుని గుంటూరు నగరం లోని వారి నివాసంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పరామర్శించారు.

# ఎంపిడిఓ మల్లీశ్వరికి సన్మానం



(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 28)
బద్వేలు మండల అభివృద్ధి అధికారినిగా విధులు నిర్వర్తిస్తున్న మల్లీశ్వరి, బదిలీపై విజయవాడలోని పంచాయతీరాజ్ కమిషనరేట్ కు వెళుతుండటముతో మంగళవారం స్థానిక కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి మల్లేశ్వరి మాట్లాడుతు తనకు ఈ మండలంలో పనిచేయటం ఎంతగానో సంతృప్తినిచ్చిందన్నారు. తనకు సహకరించిన సిబ్బందికి , ఇతర శాఖల అధికారులకు ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారి టిఎన్విఆర్ కృష్ణ శర్మ, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి అల్లా బకాష్, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీకి షాక్ టీడీపీలో భారీ చేరికలు

### బొల్లాపల్లి, తాటివారిపాలెం నేతలు టీడీపీ వైపు

### కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే ఏలూరి

(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఫిబ్రవరి 28)
మార్టూరు మండలంలోని బొల్లాపల్లి, కొలలపూడి గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. శనివారం కోలలపూడి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

**బొల్లాపల్లి నుంచి గుంపుగా చేరిక....**

బొల్లాపల్లి వైసీపీ నుంచి పలు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారిలో వరికల్లు వెంకటనారాయణ, వరికల్లు అంజిబాబు, వరికల్లు శివపార్వతి, చాతరాజుపల్లి వెంకటేశ్వర్లు, భూలక్ష్మి, చాతరాజుపల్లి సుబ్బరాయుడు, శేషవాణి, యాదవరపు హనుమంతరావు, శారద, జీడిమల్ల ఎలమంద, వరికల్లు నాగేశ్వరరావు, యాదవరపు నరేష్, వరికల్లు నవీన్‌కుమార్ ఉన్నారు.

**కోలలపూడి నుంచి టీడీపీ తీర్థం...**

కోలలపూడి గ్రామానికి చెందిన పలు కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారిలో కుంచపు ఆంజనేయులు, కుంచపు శ్రీనివాసరావు, కుంచపు కొండయ్య, కుంచపు గోపి, ఆలి రాజేష్‌లు కూడా తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ఇది దోహదం చేస్తుందని నాయకులు పేర్కొన్నారు.

**అభివృద్ధి, సంక్షేమం పై నమ్మకమే....**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ విధానాలపై విశ్వాసంతోనే వివిధ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని పేర్కొన్నారు.

**గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం...**

పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామని, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, నాయకులు హనుమంతరావు, మారుతి తదితరులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే చంద్రన్న లక్ష్యం



విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నారు.

**గ్రామాభివృద్ధికి ఐక్యతే బలం....**

"ఐక్యతతోనే గ్రామ సర్వతోముఖాభివృద్ధి సాధ్యం. లక్కవరం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. 2019–24 మధ్యకాలంలో గ్రామంలో అభివృద్ధి జరగలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమయ్యాయని తెలిపారు.

**సంక్షేమ పథకాల లబ్ధి....**

గ్రామంలో మొత్తం 120 మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందుతున్నాయని ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. వృద్ధాప్య పెన్షన్ లు 40, వితంతు పెన్షన్ 34, వికలాంగుల పెన్షన్ 05, డప్పు కళాకారులు 09, చర్మకారుల పెన్షన్ 30, ఒంటరి మహిళ పెన్షన్ 01, అభయ హస్తం పెన్షన్ 01 ఇవ్వటం జరుగుతుంది అని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. అలాగే గ్రామంలో తల్లికీ వందనం పథకం ద్వారా లబ్ది పొందిన వారు 115 మంది ఉన్నారని తెలిపారు. అలాగే 'తల్లికి వందనం' పథకం ద్వారా గ్రామంలో 115 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున మొత్తం రూ.17,25,000 ఆర్థికసాయం అందిందని తెలిపారు. 70 మంది తల్లుల ఖాతాల్లో ఈ సాయం జమ అయ్యిందన్నారు.





# లడ్డు రాజకీయాలను ఆపి ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ సందర్శనలో ఎందుకన్నారు. వెలుగొండ మొదటి దశ పూర్తికి రూ. 2000 కోట్లు అవసరమని అధికార గణం ఒకవైపు చెపుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బడ్జెట్లో రూ. 480 కోట్లు కేటాయించటం ఎంతవరకు సబబు అన్నారు. నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు, మూడు జిల్లాల ప్రజలకు తాగునీరు అందించే వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి 30 సంవత్సరాలు దాటిన ఇప్పటికీ పూర్తి కాకపోవటం కేవలం పాలకుల నిర్లక్ష్యం, చిత్తశుద్ధి లేకపోవడమే అన్నారు. పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు వంతున ఇళ్ల స్థలాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ మూడు బడ్జెట్లలో 30 పైసలు కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిట్కో గృహాలు ఊసే లేదన్నారు. ఆన్లైన్లో ఇళ్ల స్థలాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అర్జీలు ఇవ్వాలని అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణలో ఒక అడుగు ముందుకు పడలేదు అన్నారు. ఎమ్మార్వో కార్యాలయాల్లో, కలెక్టర్ కార్యాలయాల్లో అర్జీలు చెదలు పట్టే స్థితికి వచ్చాయన్నారు. అదే స్థాయిలో కార్మిక నగర్లో పేదలు గుడిసెలు వేసుకుంటే అధికారులు మాత్రం వాటిని కూల్చి వేసేందుకు చట్టాలు గుర్తుకు వస్తాయి అన్నారు. కార్మిక నగర్ స్థలాన్ని కాజేసేందుకు ఎవరు కుట్ర పన్నుతున్నారో తమకు తెలుసు అన్నారు.

ఈ విధంగానే పాలన సాగితే ఇప్పటివరకు 11 అంటూ వైసీపీని ఎద్దేవా చేసిన కూటమి ప్రభుత్వం తొమ్మిది స్థానాలకు దిగజారుతుందని హెచ్చరించారు. తేదీ నుండి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఇల్లు అద్దెదా, సొంతదా, రేషన్ కార్డు ఉందా, పింఛన్ వస్తుందా, స్మశాన వసతి ఉందా అనే అంశాలపై సామాజిక సర్వే నిర్వహిస్తామన్నారు. ఈనెల 24వ తేదీన ఇళ్ల స్థలాలకి సచివాలయాలు, తహసిల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారికి నివేశిత స్థలం, కట్టుకునేందుకు రూ. ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇళ్ల అద్దెలను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం కల్తీ ఆహారానికి కేంద్ర బిందువుగా. తాగే నీరు నుండి తీసుకునే ఆహారం, గాలి, పాలు, హోటల్ ఆహారాలు వంటి పదార్థాల వరకు కల్తీ జరుగుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం ఫుడ్ కంట్రోల్ అధికారుల నియామకాలను చేపట్టి వెంటనే కల్తీ ఆహారాలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం తన తీరు మార్చుకోకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సహాయ కార్యదర్శి ఆర్ వెంకట్రావు, ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి






# ఒంగోలు ప్రజలు ఐదు సార్లు గెలిపిస్తే నీవెక్కడ

పోతురాజు కాలువ, కోర్టు రోడ్డు, గాంధీ పార్క్ తో పాటుగా పళ్ళ పనులు అభివృద్ధికరంగా జరుగుతున్నాయన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా చేసిన బాలినేని హయాంలో చెప్పుకోవడానికి ఒక్క పనీ లేదన్నారు. అమృత్ టు ద్వారా ప్రతి రోజు మంచినీరు ఇచ్చేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. జిజిహెచ్‌లో కూడా కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేగా ఒంగోలులో తాను ఉంటే, సమస్యలు పరిష్కరించాలంటూ హైదరాబాదులో ఉండే బాలినేనికి ప్రజలు ఫోన్ చేస్తున్నారని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. అసలు పనులు చేయని బాలినేనికి ప్రజలు ఎలా ఫిర్యాదు చేస్తారని ఎద్దేవా చేశారు. త్వరలో కొత్తపట్నం హార్బర్ పనులు ప్రారంభమవుతాయన్నారు. అలాగే ఎయిర్పోర్ట్ లీగల్ సమస్యలను పరిశీలిస్తామన్నారు. వెంచర్లకు భూమి పూజ చేస్తే ప్లాట్లు ఇస్తారా అని ప్రశ్నించారు. అన్ని రంగాలలో ప్రజలను దోచుకున్న చరిత్ర మీది అన్నారు. చివరకు ఎర్రజర్ల కొండ మట్టిని తవ్వినందుకు పెనాల్టీ కట్టిన చరిత్ర నీదన్నారు. పవన్ కళ్యాణ్ నిన్ను నమ్మి జనసేన పార్టీలో ఎలా చేర్చుకున్నారో అర్థం కావటం లేదన్నారు. ఇటీవలే పవన్ కళ్యాణ్‌ను తాను కలిశానని, ఒంగోలు అభివృద్ధి గురించి వివరించానని పేర్కొన్నారు. త్వరలో పవన్ కళ్యాణ్‌కు నీ చరిత్ర అర్థమవుతుందని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. మీడియా సమావేశంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, ఒంగోలు నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సింగరాజు రాంబాబు, తదితరులు ఉన్నారు.

# సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు పలికిన జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 28)
పోలీసు శాఖలో విశేష సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఐ ఆర్ శ్రీనివాసరావు, మద్దిపూడి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎమ్ సలీం ఇద్దరని శనివారం ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయంలో శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు, కఠిన పరిస్థితులు ఎదుర్కొంటూ పోలీసు ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేయడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. పోలీసు విధుల నిర్వహణలో కుటుంబానికి దూరంగా ఉంటూ విధులపట్ల అంకితభావంతో పనిచేశారన్నారు.




పోలీసు ఉద్యోగంలో సేవలందించేందుకు సహాయ సహకారాలు అందించిన కుటుంబ సభ్యులకు జిల్లా పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. వారి పట్ల ప్రేమ, ఆప్యాయతతో ఉండాలని సూచించారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. విరమణ అనంతరం ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చని, పోలీసు శాఖ ఎల్లవేళలా వారికి తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఇక్టర్ శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఏఆర్ వెల్ఫేర్ సీతారామరెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.





# 26 వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

### మాట నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఫిబ్రవరి 28)
మాచర్ల పట్టణంలోని 26 వార్డు నందు ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిమిత్తం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు శనివారం 58వ బూత్ ఇన్చార్జి పల్నాడు జిల్లా టిడిపి పార్లమెంటరీ సెక్రెటరీ షేక్ జానీ భాష వార్డులోని పెన్షన్ లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి ఇచ్చిన మాట ప్రకారం ఒకటో తారీకున పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుంది. అందుకు గాను మార్చి ఒకటో తారీకు ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగానే ఫిబ్రవరి 28వ తేదీన పెన్షన్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనంతరం మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడవడానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచితంగా 8 వేల సైకిళ్ల పంపిణీ పూర్తి





## పాఠశాల విద్యకు దూరం కాకూడదనే విద్యార్థులకు సైకిళ్లు మార్చి నెలాఖరుకు మరో 3 వేల సైకిళ్లను విద్యార్థులకు అందజేస్తాం ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్








(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఫిబ్రవరి 28)

అద్దంకి నియోజవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8 వేల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. దూరాభారం, వ్యయప్రయాసల వలన ఎవరూ పాఠశాల చదువులకు దూరం కాకూడదనే అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులందరికీ సైకిళ్లను ఉచితంగా అందిస్తున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. సంతమాగులూరు మండలంలోని ఏల్చూరులో శనివారం నాడు మంత్రి గొట్టిపాటి పర్యటించారు. ఏల్చూరు ఉన్నత పాఠశాలలో 454 మంది విద్యార్థులకు ఆయన సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ., దాతల సహాయంతో ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తాను ఎన్నికల ప్రచారంలో ఉన్న సమయంలో కొందరు 8, 9 తరగతుల విద్యార్థులు రెండు, మూడు కిలోమీటర్ల దూరం నుంచి స్కూళ్లకు నడిచి రావడం గమనించానన్నారు. ముందుగా 8, 9 తరగతులు వారికి మాత్రమే సైకిళ్లు అందించాలని అనుకున్నా, ఆ తరువాత కొందరు చిన్నారులు అడగటంతో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లను ఇస్తున్నామని మంత్రి వెల్లడించారు. పాఠశాల విద్యార్థులతో పాటు కొందరు ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ చదివే పేద విద్యార్థులకు కూడా దాతల సహాయంతో సైకిళ్లను పంపిణీ చేశామని చెప్పారు. అద్దంకి నియోజకవర్గంలో మరో 3 వేలు సైకిళ్లు ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందించాల్సి ఉందని తెలిపారు. వాటిని కూడా మార్చి నెలాఖరు, విద్యా సంవత్సరం పూర్తయ్యే నాటికి పంపిణీ చేస్తామని మంత్రి గొట్టిపాటి ప్రకటించారు.


### నాణ్యమైన విద్యతోనే అభివృద్ధి....

నాణ్యమైన పాఠశాల విద్యతోనే భావి తరాలు అభివృద్ధి చెందుతాయన్న సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు అమలు చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ప్రైవేటు స్కూల్స్, కార్పొరేట్ విద్యకు ధీటుగా మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. అదే విధంగా చదువుల్లో రాజకీయాలు ఉండకూడదనే పార్టీ గుర్తులు లేకుండా విద్యార్థులకు బ్యాగ్ లు, పుస్తకాలు, యూనిఫాంలు నాణ్యమైనవి అందించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా మెగా డిఎస్సీ ద్వారా ఒకేసారి 16,300 టీచర్ పోస్టులను భర్తీ చేశామని ఆయన స్పష్టం చేశారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు కూడా మంచిగా చదివి తల్లిదండ్రులతో పాటు పాఠశాలలకు గొప్ప పేరు తీసుకు రావాలని ఆయన సూచించారు. ఒక్కొక్క సైకిల్ రూ.6 వేల వ్యయంతో విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఏల్చూరు పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను అందించడంలో తోడ్పాటు అందించిన సీల్ వెల్ కంపెనీ అధినేత సుబ్బారావును మంత్రి గొట్టిపాటి అభినందించారు. ముందుగా ఏల్చూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజబాబు తో కలిసి మంత్రి గొట్టిపాటి, లబ్ధిదారులకు పింఛను అందించారు. అనంతరం ఏల్చూరులో మంత్రి గొట్టిపాటి ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వాటిని అధికారులకు అందజేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ తరువాత సింగరకొండపాలెంలో కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వర్గీయ ఎన్టీ రామారావు విగ్రహాన్ని మంత్రి గొట్టిపాటి ఆవిష్కరించారు. తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి ఎన్టీఆర్ అని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి కొనియాడారు. ఎన్టీఆర్ ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు నేటికీ మార్గదర్శకాలు అన్నారు.

### ప్రసన్నాంజనేయునికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి గొట్టిపాటి

అద్దంకి మండలం శింగరకొండలో కొలువుదీరిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానం 71వ వార్షికోత్సవ తిరునాళ్లు ప్రారంభం సందర్భంగా ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం నాడు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న మంత్రి గొట్టిపాటికి వేద పండితులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన మంత్రి గొట్టిపాటికి అర్చకులు వేద ఆశీర్వచనంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తాగునీరు, క్యూ లైన్లు, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరాతో పాటు అన్నీ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. తిరునాళ్లు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా సాగాలని మంత్రి గొట్టిపాటి ఆకాంక్షించారు. అదే విధంగా శింగర కొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి కూడా పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి గొట్టిపాటి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి గొట్టిపాటి కొందరు భక్తులకు స్వయంగా తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయడం విశేషం.

# పింఛన్ పంపిణీ చేసిన టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెంగల్ రెడ్డి



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 28)

మండలంలోని అమాని గుడిపాడు గ్రామంలో నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాలతో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్‌లను యర్రగొండపాలెం మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, పంచాయితీ కార్యదర్శి రామారావు నాయక్ లు కలిసి పంపిణీ చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ సైన్స్ డే కార్యక్రమం







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 28)

మండల కేంద్రమైన ఉలవపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం డాక్టర్ జి ఎల్ సుధారాణి సుధారాణి అధ్యక్షతనలో డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్సెస్ వారు డాక్టర్ సిహెచ్ మాణిక్యరావు, డాక్టర్ డి. సుజాత, బి తేజస్వి నేషనల్ సైన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని దేశంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన జరుపుకుంటారు. రామన్ ఎఫెక్ట్ ను కనిపెట్టిన చంద్రశేఖర వెంకట రామన్ తన పరిశోధన ఫలితాన్ని ధ్రువీకరించిన రోజు ఫిబ్రవరి 28 దీనితో ఆ రోజునే నేషనల్ సైన్స్ డే గా జరుపుకోవాలని 1987లో భారత ప్రభుత్వం ప్రకటించింది. భారత్ గడ్డపైనే చదువుకొని తల మాణికమైన పరిశోధనలు జరిపి సైన్స్ లో దేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పిన మేధావి రామన్ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వారు నిర్వహించిన వకృత్వ పోటీలలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. మొదటి బహుమతిగా డి. పూజ ఫస్ట్ బీఎస్సీ,, రెండవ బహుమతి ఎం. సుప్రియ సెకండ్ బీఎస్సీ, పి. పవిత్ర సెకండ్ బీఎస్సీ గెలుచుకున్నారు ఈ కార్యక్రమంలో కళాశాల, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# యాలి వాహనం పై ఊరేగిన వేంకటేశ్వరుడు



(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 28)

మండల పరిధిలోని అనంతరాజపురంలో వెలసివున్న 5శతాబ్దాల నాటి చారిత్రాత్మక శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామివారి ఆలయ వార్షిక ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామివారు యాళి వాహనంపై గ్రామంలో ఊరేగారు. యాలి వాహనంపై ఊరేగుతున్న శ్రీవారిని దర్శించుకున్న భక్తులు, భక్తి పారవశ్యంలో గోవింద నామస్మరణలతొ పులకించి పోయారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చాటకొండు సంజీవకుమార్, ఆలయ ఈవో రామలింగారెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన అలవాట్లకు నాంది ముస్తాబు

## విద్యార్థుల కోసం 'ముస్తాబు' కార్యక్రమం పై అవగాహన

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 28)

స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నో బ్యాగ్ డే పురస్కరించుకొని కనిగిరి పట్టణ అభివృద్ధి మరియు పరిశుభ్రతను లక్ష్యంగా పెట్టుకొని కనిగిరి పురపాలక సంఘం, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "ముస్తాబు" కార్యక్రమంపై కనిగిరి పట్టణం లోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా ఉంచేందుకు ప్రతి పౌరుడి బాధ్యత ఏమిటి, చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెత్తను నిర్దిష్ట ప్రదేశాల్లో వేయడం వంటి అంశాలపై కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ వివరించారు. విద్యార్థులు సమాజంలో మార్పు తీసుకురాగల శక్తి అని, వారు ముందుండి ప్రజలకు సందేశం చేరవేయాలని సూచించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతలో భాగంగా తల దువ్వుకోవడం, గోళ్లు కత్తిరించుకోవడం, శుభ్రమైన దుస్తులు ధరించడం వంటి అలవాట్లు ఎంతో అవసరమని వివరించారు. ప్రతి రోజు తల దువ్వుకోవడం ద్వారా పరిశుభ్రతతో పాటు వ్యక్తిత్వంలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. గోళ్లు సమయానికి కత్తిరించుకోవడం ద్వారా సూక్ష్మక్రిముల వ్యాప్తిని నివారించవచ్చని చెప్పారు. అలాగే ప్రతిరోజూ శుభ్రమైన, ఉతికిన దుస్తులు ధరించడం ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా క్రమశిక్షణను ప్రతిబింబిస్తుందని తెలియజేశారు. ఈ అలవాట్లు విద్యార్థుల ఆరోగ్యకరమైన జీవనశైలికి బలమైన పునాది వేస్తాయని, "ముస్తాబు" కార్యక్రమం ద్వారా ఇలాంటి మంచి అలవాట్లను ప్రతీ విద్యార్థి అలవరచుకోని ముస్తాబు స్టార్ లుగా ఉండాలని అవగాహన కలిగించారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపాల్ సిస్టర్ పౌలిన్ ఉపాధ్యాయులు, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ భాషా, తదితరులు పాల్గొన్నారు.






# కొమ్మూరు కాలువలో గుర్తుతెలియని మృతదేహం



(షణ్ముఖ వెలుగు, కారంచేడు, ఫిబ్రవరి 28)

కొమ్మూరు కాలవలో గుర్తుతెలియని మృతదేహం కోట్టుకు వచ్చిన ఘటన శనివారం చేటుచేసుకుంది. కారంచేడు ఎస్ఐ ఖదీర్ భాషా అందించిన వివరాలు మేరకు... కారంచేడు మండలంలోని కుంకలమర్రు గ్రామం కొమ్మూరుకాలవ వంతెన వద్ద సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని మగ మనిషి మృతదేహం కనిపించిందని తెలిపారు. మృతదేహం ఎత్తు సుమారు 5.8 అడుగులు, మృతుడు చామనచాయ వర్ణం కలిగి ఉన్నాడు, మృతుడు ఎరుపు, నలుపు గళ్ళు గల నిండుచేతుల చొక్కా,గోదుమ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం నరసాయపాలెం లాక్కులు వైపు నుండి నీటి ప్రవాహంతో కొట్టుకొని వచ్చినట్లు అనిపిస్తుందని మృతదేహాన్ని ఎవరు గుర్తుపట్టిన ఏడల ఎస్ఐ కారంచేడు 9121102145 సిఐ ఇంకోల్లు 9121102147 ఫోన్ నెంబర్లకు సంప్రదించలనీ తేలియాజేసారు.

# రెండు సంవత్సరాలు గడిచినా కొత్త పెన్షన్లు ఎక్కడ...?



## కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని చైర్మన్ అబ్దుల్ గఫార్ డిమాండ్

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 28)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా కొత్త పెన్షన్ల మంజూరు విషయంలో స్పష్టత లేకపోవడంపై కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కాశిరెడ్డి కాలనీలో ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లను పంపిణీ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 50 సంవత్సరాలు నిండిన అర్హులైన పేదలకు కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, మహిళలు, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఆర్థిక భరోసా కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి కొత్త పెన్షన్లు మంజూరు చేసేవారని, ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. పేదల జీవనోపాధికి భరోసా కల్పించడం ప్రభుత్వ ధర్మమని, తక్షణమే అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఇంటింటికీ పింఛన్ పంపిణీ







(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, ఫిబ్రవరి 28)

మద్దిపాడు బీసీ కాలనీలో పేదల సేవలో భాగంగా ఎన్టీఆర్ సామజిక భద్రత భరోసా పెన్షన్స్ పంపిణి కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు 4000 వేల రూపాయలను అందించిన సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బి.ఎన్.విజయ్ కుమార్ అనంతరం మద్దిపాడు మండలం కోస్టాల్ గ్రామంలో 30 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డులు మరియు సైడ్ డ్రైనేజీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ కృష్ణమోహన్ ,ఈ కార్యక్రమంలో అడకా స్వాములు,మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, మదనపల్లి శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, (పి.యస్.ఆర్), మండల అధికారులు, రాష్ట్ర నాయకులు, పార్లమెంట్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## క్వీస్ విద్యాసంస్థల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ఎక్స్ పో**

**సర్ సివిరామన్ కి నివాళులర్పించిన విద్యార్థులు**





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 28)

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, క్విస్ హైస్కూల్ లో సైన్స్ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి తెలియజేశారు. క్విస్ స్కూల్ లో జరిగిన సైన్స్ ఎక్స్ పోకి విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పరిశోధనాత్మక ఆలోచనలు అలవర్చుకోవాలని అన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని చెప్పారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ నమూనాలను ఆమె ఆసక్తిగా తిలకించి, వారి ప్రతిభను అభినందించారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రత్యేక బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ సత్యమెహర్, మొదటి ఏడాది హెచ్ వోడీ డాక్టర్ జి. శ్రీనివాసరావు, స్కూల్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సైన్స్ డిపార్ట్మెంట్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలతో వ్యాపారం ఆపండి

**అద్దె ఫార్మసీ సర్టిఫికెట్లతో మెడికల్ షాపులా**

**పెన్ను, కాయితాలతో ఆస్తులు రాయించుకునే స్థాయికి ప్రైవేటు వైద్యం చేరింది**

**యదేచ్ఛగా రాష్ట్రంలో మెడికల్ మాఫియా**

**మామూళ్ల మత్తులో డ్రగ్ కంట్రోల్ అధికారులు**

**వైద్యం కన్నా వ్యాపారం, డబ్బుకే విలువ ఇస్తున్న వైద్యులు**

**బడ్జెట్లో ఆరోగ్యశ్రీకి నిధులు కేటాయింపు కాదు,**

**ప్రభుత్వ వైద్యశాలల్లో వసతుల మెరుగుకు అధిక నిధులు కేటాయించాలి**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్**

**మెడికల్ మాఫియా, డ్రగ్ మాఫియా, కార్పొరేట్ వైద్య దోపిడీ కి వ్యతిరేకంగా కలెక్టరేట్ వద్ద సిపిఐ నిరసన ధర్నా**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 28)

ప్రజల ప్రాణాలతో వైద్య వ్యాపారాలు ఆపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద డ్రగ్ మాఫియా, మెడికల్ మాఫియా, కార్పొరేట్ వైద్య దోపిడీకి వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఒంగోలులో డ్రగ్ మాఫియా, మెడికల్ మాఫియా, కార్పొరేట్ ఆసుపత్రుల్లో దోపిడీకి వ్యతిరేకంగా సిపిఐ ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ మాఫియా, డ్రగ్ మాఫియా ప్రజల ఆరోగ్యంతో, ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 50 వేలకు పైగా మెడికల్ షాపులు ఉంటే వాటిలో ఎక్కువ భాగం అద్దె సర్టిఫికెట్లతో నడిపేవే అన్నారు. మెడికల్ షాప్ లలో ఫార్మసిస్టులు ఉండరన్నారు.



అంతేకాకుండా ఎక్కువ భాగం మెడికల్ షాపులు ఇచ్చిన మందులకు బిల్లులు ఇవ్వరన్నారు. డయాగ్నిక్ సెంటర్లలో అవసరం లేకున్నా, విపరీతంగా టెస్టులు రాసి ప్రజలతో పెద్ద ఎత్తున వైద్య వ్యాపారాలు చేస్తున్నారన్నారు. సో కాల్డ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లు, సో కాల్డ్ కార్పొరేట్ హాస్పిటల్లో ప్రజల ఆరోగ్యాన్ని వ్యాపారంగా మార్చి దోపిడీకి నిలయాలుగా మారాయి అన్నారు. చిన్న రోకమైన నాడిపట్టి నివారణ చెప్పాల్సిన వైద్యులు అందుకు విరుద్ధంగా చేతిలో పెన్ను, కాగితంతో ఆస్తులు రాయించుకునే స్థితికి ప్రైవేట్ వైద్యరంగం చేరుకుందన్నారు. కళ్ళుండి చూడలేక, చెవులు ఉండి కబోదిలా రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగం పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందన్నారు. సచ్చిన శవాలకు కూడా వైద్యం చేసిన ఘనత రాష్ట్రంలోని కార్పొరేట్ ఆస్పత్రులకు ఉందన్నారు. వీటికి వ్యతిరేకంగా తెచ్చిన చట్టాల ఉల్లంఘన యదేచ్ఛగా కొనసాగుతుందన్నారు. జగ్గు కడుపులో అధికారులు మెడికల్ షాపులు, ఫార్మసీ కంపెనీల దగ్గర ఎంగిలి కూడు తినటానికి అలవాటు పడి, అవినీతిలో కూదుకుపోయి, ప్రజారోగ్యాన్ని అత్యంత దారుణమైన స్థితికి నెట్టివేశారు అన్నారు. ప్రజలకు జీవించే హక్కును కాల రాస్తున్నారు. కార్పొరేట్ వైద్యశాలల్లో పేషంట్ కి వైద్యం కన్నా ముందుగా అతను ఏ ఏ హెల్త్ ఇన్సూరెన్స్ లు తీసుకొని ఉన్నారో, ఎంత రా పట్టుకోవచ్చు లెక్కలు వేసి మరి వైద్యం చేస్తున్నారన్నారు. బజరంగం ప్రభుత్వం ఆధీనంలోనే ఉండాలన్నారు. బడ్జెట్లో ఆరోగ్యశ్రీకి రూ. 4 వేల కోట్లు కేటాయించి, కార్పొరేట్ ఆసుపత్రులకు దోచిపెట్టడం కన్నా, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు, నర్సులు, మందులు, మెడికల్ పరికరాలు అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నించేయాలని సూచించారు. వైద్య విద్య ప్రభుత్వం ఆధీనంలోనే ఉండాలన్నారు. వైద్య విద్యలో పి పీ పీ విధానానికి స్వస్తి పలకాలని హితవు పలికారు. ప్రభుత్వం డ్రగ్ మాఫియా, మెడికల్ మాఫియా, కార్పొరేట్ వైద్య దోపిడి లను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ మాఫియా, జగ్గ మాఫియా తీవ్రస్థాయిలో ఉందన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయన్నారు. నాసిరకం మందులతో, గడువు తీరిన మందులతో ప్రజలకు ఉన్న రోగాలతో పాటు , అదనపు రోగాలు వచ్చి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో డాక్టర్ పోస్టులు, నర్సుల పోస్టులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ వైద్యం పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కార్పొరేట్ వైద్యశాలపై, డయాబెటిక్ సెంటర్ లపై, డ్రగ్ మాఫియా పై, మెడికల్ మాఫియా పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లూరి మురళి, కే. వీరారెడ్డి, ఎం. విజయ, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అవ్వతాతలకు పింఛన్లు పంపిణీ

**ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 28)

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒక్కరోజు కూడా ఆపకుండా ముందుగానే అవ్వతాతలు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు పేర్కొన్నారు. నగరంలోని 23వ డివిజన్ గానుగపాలెం ప్రాంతంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో 13 కోట్ల రూపాయల పైచిలుకు వృద్ధాప్య వితంతు, పూర్తిగా బ్లడ్ రెస్ట్ లో ఉన్నవారికి పెన్షన్లు అందించడం జరుగుతుందని ఇంకా 1500 మంది పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని వారికి కూడా త్వరలో అందిస్తామని అన్నారు. సంక్షేమం అభివృద్ధి రెండు సమానంగా కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకు వెళుతుందని ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అధికంగా మన రాష్ట్రంలోనే అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.



ఇటీవల మాజీ మంత్రివర్యులు బాలినేని శ్రీనివాసులు రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ఏదో తోకచుక్క లాగా వచ్చి నాలుగు మాటలు మాట్లాడి పోవడం సరికాదని, ఆయన మాట్లాడిన దానిపై పూర్తిగా స్పందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాల సంస్థ కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావు, ఉడా చైర్మన్ షేక్ రియాజ్, ఏ ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటారి నాగేశ్వరరావు, నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, పాలూరి వెంకటేశ్వర రెడ్డి, 23వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు వలేటి పవన్ కుమార్, హనుమంతరావు, గోపు వీరాంజనేయులు, రాము, అబ్దుల్లా, అక్బర్ ఖాన్, బద్రి కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.






## ఖైదీలకు అందుతున్న వసతులు పరిశీలన







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 28)

భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వారి ఆదేశాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనలతో ఒంగోలు జిల్లా జైల్లోని ఖైదీలకు అందుతున్న వసతి, భోజన సదుపాయాలను పరిశీలించడానికి మెంబర్స్ ఆఫ్ బోర్డ్ ఆఫ్ విజిటర్స్ ఆఫ్ ప్రిజనర్స్ అనే కమిటీ శనివారం ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి టి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో సభ్యులుగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ జిల్లా కలెక్టర్ తరపున డిస్టిక్ రెవెన్యూ ఆఫీసర్ ఓబులేసు, జిల్లా పోలీసు సూపర్నెంట్ తరఫున డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు, డిఎంహెచ్వో టి. వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ యస్. శ్రీనివాసరావు ,డీఈఓ సి.వి. రేణుక, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే .గోపి నాయక్ డిస్టిక్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎస్ . పద్మ మరియు ఇతర జిల్లా అధికారుల ఆధ్వర్యంలో జిల్లా జైలును తనిఖీ చేసి అక్కడ స్టోర్ రూమ్ ను, వంటశాలను, ఖైదీల బ్యారకులను , సంబంధిత దస్త్రాలను పరిశీలించారు.

# రూ.19 కోట్లతో కందుకూరు శివారు ప్రాంతాలకు తాగునీరు

**ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**
**టెండర్లు పూర్తి, త్వరలోనే పనులు మొదలు**
**ప్రతి ఇంటికీ సంక్షేమం, కూటమి ప్రభుత్వ లక్ష్యం**
**ప్రజాసేవలో చంద్రబాబు నిరంతర శ్రామికుడు**
**అయినా విమర్శలు దారుణం**
**ఆ పార్టీనేతల వ్యవహారశైలిలో ఇంకా మార్పు రాలేదు**
**కందుకూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**
**ఒక రోజు ముందుగానే పింఛన్ మొత్తం చేతికి**
**లబ్ధిదారుల కళ్ళల్లో సంతోషం**







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 28)

కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శివారు ప్రాంతాలలో తాగునీటి సరఫరా కోసం అమృత్ 2.0 పథకం ద్వారా 19 కోట్ల రూపాయలతో త్వరలో పనులు ప్రారంభం కాబోతున్నట్లు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వెల్లడించారు. అందుకు సంబంధించి టెండర్లు కూడా పూర్తయ్యాయని తెలిపారు. పోతురాజుమిట్ట ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఇక్కడే ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా, కందుకూరు పట్టణంలోని 12వ వార్డు పోతురాజుమిట్ట ప్రాంతంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. దాదాపు 25 మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్ల మొత్తాన్ని అందజేశారు. వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్నాయి, ప్రతిరోజు చెత్తను క్లియర్ చేస్తున్నారా, సైడ్ కాలవలు ఎన్ని రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నారు, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా... అంటూ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ మార్చి ఒకటవ తేదీ ఆదివారం కావడంతో, ఒకరోజు ముందుగానే పింఛన్లను అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల కళ్ళల్లో సంతోషాన్ని చూస్తున్నానని, వారి ఆశీస్సులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు, కూటమి ప్రభుత్వంపై మెండుగా ఉన్నాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి పింఛన్ ఏడాదికి 250 రూపాయలు చొప్పున మాత్రమే పెంచిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేస్తూ.... కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచినట్లు తెలిపారు. దివ్యాంగులు పింఛన్ 3 నుంచి 6 వేలకు, శాశ్వత వైకల్యం ఉన్నవారి పింఛన్ 15వేల రూపాయలకు పెంచడం పట్ల ఆయా కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని నాగేశ్వరరావు అన్నారు. అభివృద్ధి సంక్షేమాన్ని జోడెడ్ల సవారిలాగా చంద్రబాబునాయుడు గారు ముందుకు తీసుకు వెళుతున్నారని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని చంద్రబాబు నాయుడు గారు నెరవేర్చారని, ప్రజలంతా కూటమి పాలన పట్ల సంతోషంగా ఉన్నారని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందించే విధంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుంటే, వైసీపీ నేతలు విమర్శలు చేస్తుండటం దారుణమని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. ప్రజలు వారిని 11 సీట్లకు పరిమితం చేసినా, వారి వ్యవహార శైలిలో ఇంకా మార్పు రాలేదని విమర్శించారు. ఈసారి ఆ 11 కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో విధ్వంసం సృష్టించేలా, కులాలు మతాల మధ్య గొడవలు రేపి హింసా వాతావరణాన్ని ప్రేరేపించేలా వైసీపీ నేతల ప్రవర్తన ఉందన్నారు. కానీ చంద్రబాబు ముందు వారి ఆటలు సాగవన్నారు. తెలుగుదేశం, బిజెపి జనసేన పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం గురించి మాత్రమే తాము ఆలోచన చేస్తున్నామని చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక టిడిపి నాయకుడు జక్కుల మల్లికార్జున ఇంటికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెళ్లి పరామర్శించారు. అంతకుముందు టిడిపి నాయకుడు తానికొండ ప్రవీణ్ కొత్తగా కొనుగోలు చేసిన కారును స్థానిక టిడిపి కార్యాలయం నుంచి పోతురాజుమిట్ట వరకు ఎమ్మెల్యే స్వయంగా డ్రైవ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు వార్డు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు మోసంగి ప్రసాద్, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, చిలకపాటి మధు, పోకూరి రాంబాబు, చదలవాడ కొండయ్య, షేక్ రూబీ, వడ్డేళ్ళ రవిచంద్ర, కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, షేక్ సలాం, భాష, మంగపాటి శ్రీనివాసరావు, కోటాపురి శ్రీను, చెమిడిగుంట రాజశేఖర్, జక్కుల శ్రావణ్ కుమార్, తన్నీరు రాజశేఖర్, సయ్యద్, బాబా, మేరీ భాష, కొత్తూరు వెంకట సుధాకర్, మురారి శెట్టి వెంకట సుధీర్, తానికొండ శ్రీను, అన్ని వార్డుల అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## కంభంలో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

**రైతులకు గిట్టుబాటు ధరే లక్ష్యం**
**ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి**





(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 28)

పట్టణంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సంప్రదాయబద్ధంగా కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ సంకల్పాన్ని వివరించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మధ్యవర్తుల ఆధీనంలో రైతులు నష్టపోకుండా, నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయడం ద్వారా వారికి లాభం చేకూరుతుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయితే పశ్చిమ ప్రకాశం ప్రాంత రైతాంగానికి దీర్ఘకాలిక సాగునీటి ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఇప్పటికే రైతులకు “అన్నదాత సుఖీభవ” పథకం ద్వారా సంవత్సరానికి 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, అదనంగా వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, వ్యవసాయ శాఖ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభంతో ప్రాంతీయ రైతులకు మార్కెట్ భరోసా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కామ్రేడ్ సూరా పాపిరెడ్డి సేవలు మరువలేనివి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 28)

కనిగిరి పట్టణంలోని సుందరయ్య భవనంలో శనివారం కామ్రేడ్ సూరా పాపిరెడ్డి వర్ధంతి సభ పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు అధ్యక్షతన జరిగింది. తొలుత సురా పాపిరెడ్డి, తవనం చెంచయ్య, పమిడి కోటయ్య, ఏనుగుల పుల్లయ్య చిత్రపటాలకు సిపిఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. అనంతరం రెడ్ బుక్కు డే పురస్కరించుకొని స్టడీ సర్కిల్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవి కొండారెడ్డి మాట్లాడుతూ ఎర్రజెండా పట్టుకుని నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందించిన మహనీయుల మార్గంలో అందరం పయనించాలని సూచించారు. అందరూ పుస్తక పఠనం పెంపొందించుకుని సమాజ మార్పుకు దోహదపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పిల్లి తిప్పారెడ్డి ,ఆర్ మాలకొండయ్య, పి మహేష్, వెంకటమ్మ, ఆర్ ఏడుకొండలు, కాశయ్య, ఎస్ తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 28)



పట్టణంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తూ తరగతి గదులు, విద్యార్థుల హాజరు, బోధన విధానాలు, మౌలిక వసతుల పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న విద్యా కార్యక్రమాలపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సత్సంబంధం ఏర్పరుచుకుని వారి అభిరుచులు, చదువులో ఎదుర్కొంటున్న సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల మరమ్మతులు వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. అవసరమైన చోట మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని సూచిస్తూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో వారి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న విద్యా అంతరాన్ని తగ్గించే దిశగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సక్రమంగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే సందర్శనతో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.





## నేతాజీ పాఠశాలలో ఘనంగా సైన్స్ డే సంబరాలు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 28)

బద్వేల్‌లోని నేతాజీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో జాతీయ సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. సివి రామన్ ఎఫెక్ట్ ను స్మరించుకుంటూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ తరగతుల విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్ట్‌లను అతిథులు, ఉపాధ్యాయులు పరిశీలించి ప్రశంసించారు. పరిసరాల పరిరక్షణ, ఇంధన పొదుపు, డిజిటల్ టెక్నాలజీ, ఆరోగ్యం వంటి అంశాలపై మోడల్స్ మరియు వర్కింగ్ ఎక్స్‌పెరిమెంట్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కుమారి అనుమల విజయలక్ష్మి మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సైన్స్ ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసిందన్నారు.

## విద్యార్థి ఆరోగ్య నిమిత్తం ఆర్థిక సాయం



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 28)

మండలంలో ఎంపియుపి కొత్తపల్లి స్కూల్ నందు ఐదవ తరగతి చదువుతున్న పోలు కృష్ణ అనే విద్యార్థికి ప్లేట్లెట్లు పడిపోవడం వల్ల ఆరోగ్యం దెబ్బతిన్నది,ఆ విద్యార్థి తల్లిదండ్రులు చాలా పేదవారు రావడంతో ఆ విద్యార్థి వైద్య ఖర్చులకు కొత్తపల్లి హెడ్ మాస్టర్, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు కలిసి రూ.7వేలు అందించారు. ఈ నగదును వారి తల్లికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి లాల జ్యోతి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయ బృందం డి జీవన జ్యోతి, ఎస్కె చాంద్ భాషా, పటాన్ మహబూబ్ ఖాన్, జెడి పార్థసారథి, ఎం మురళి గోపాల్, ఎం శ్రీనివాసులు, పి రవికుమార్, ఎంవి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. అలాగే ఈ సందర్భంలో విద్యార్థి తమ్ముడైన మూడో తరగతి చదువుతున్న పోలు విష్ణును పెద్ద మనసుతో తమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎం శ్రీనివాసరావు దత్తత తీసుకోవడం జరిగింది. వారి అమ్మ సమక్షంలో దత్తత తీసుకున్నారు. నేటి నుంచి ఆ విద్యార్థి బాగోగులన్నీ శ్రీను చూసుకుంటానని వాగ్దానం చేశాడు.

## ఆవులదొడ్డి విద్యార్థికి మండల స్థాయి మొదటి బహుమతి



(షణ్ముఖ వెలుగు, చినగంజాం, ఫిబ్రవరి 28)

మండలంలోని కడవకుదురు హైస్కూల్ నందు హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు కుర్ర రామారావు ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నందు 13 పాఠశాలల నుండి 13 మంది పోటీ పడగా మొదటి బహుమతి ఆవుల దొడ్డి కొత్తగొల్ల పాలెం ఏ. నాగ కౌశిత, పెద్దగంజాం ఏ. జగదీష్ కైవసం చేసుకున్నారు. ద్వితీయ బహుమతి పి శివ సంజన అడివిదివారిపాలెం, బి సంజయ్ సంతరావూరు గెలుచుకున్నారు. తృతీయ బహుమతి కె మౌర్య నికిత రాజు బంగారు పాలెం గెలుపొందారు. ఈ సందర్భంగా ఆవులు దొడ్డి కొత్త గొల్లపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మా విద్యార్థికి మండల స్థాయి ప్రథమ బహుమతి రావడం ఆనందదాయకం అన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 28)

జెడ్పీ ఉన్నత పాఠశాల పొన్నలూరు నందు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్ సివి రామన్ యొక్క చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ శాస్త్రీయ దృక్పథం అలవరచుకొని మూఢనమ్మకాలను వదిలివేయాలని, ప్రతి విద్యార్థికి హేతుబద్ధమైన ఆలోచన ఉండాలని తెలియజేశారు. సివి రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్ వలన ప్రపంచంలో భారతదేశానికి వైజ్ఞానిక రంగంలోఒక గొప్ప గుర్తింపు లభించింది అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు ఎం యేసురత్నం మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్ ను సవివరంగా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసచారి, రమాదేవి, ఝాన్సీ లక్ష్మి, రాము, అంజిరెడ్డి, ఫాతిమా, కళావతి మాధవి తదితర ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సంగమేశ్వరండ్యాం నిర్మాణ పనులకు రూ.166.40 కోట్లు

### విడుదలకు పరిపాలన అనుమతులు



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 28)

మండలంలోని చెన్నుపాడు సమీపంలో ఉన్న సంగమేశ్వరండ్యాం నిర్మాణ పనులకోసం రూ.166.40 కోట్లు విడుదలకు పరిపాలన అనుమతులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి స్వామి శనివారం తెలిపారు. సంగమేశ్వరం రిజర్వాయర్ ద్వారా కొండపి నియోజకవర్గం లో 9500 ఎకరాలఆయకట్టు స్థిరీకరణతో పాటు 60 గ్రామాలకు త్రాగునీరు అందుతుందని తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్లో 25 కోట్లు కేటాయించిందని వైసీపీ ప్రభుత్వంలో ఈ రిజర్వాయర్ ను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు.

## జాతీయ బ్రాహ్మణ యువజన కార్యదర్శి గా సంగరాజు సాయి మనోజ్





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 28)

శనివారం ఐలాపురం హోటల్ లో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రం నుంచి 13 మందిని నూతన సభ్యులను వివిధ హోదాలలో జాతీయ స్థాయిలో నియమించడం జరిగినది. కనిగిరి పట్టణానికి చెందిన సంగరాజు సాయి మనోజ్ ని జాతీయ బ్రాహ్మణ యువజన కార్యదర్శి గా నియమించడం జరిగింది ఈసందర్బంగా వారు మాట్లాడుతూ కచ్చితంగా బ్రాహ్మణులను రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా నిలబడటానికి తాను వంతు కృషి చేస్తానని చెప్పారు అంతేకాక నాకు ఈ పదవికి తనను పిలిచి ఇచ్చిన ఏఐబిఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు రవి కుమార్, కోనూరు సతీష్ శర్మకి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నట్లు తెలిపారు.

# అర్బన్ కాలనీలో పింఛన్ పంపిణీ

### ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి
### సైడు కాలువలు, డ్రైనేజీ, కుక్కలు
### పందుల బెడదపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముత్తుముల హామీ





(షణ్ముఖ వెలుగ, కంభం, ఫిబ్రవరి 28)

కంభం పట్టణంలోని అర్బన్ కాలనీలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నిర్వహించారు. వృద్ధులు, విధవలు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ అందజేసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం సామాజిక భద్రతకు కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అయితే కార్యక్రమంలో ప్రధానంగా అర్బన్ కాలనీ ప్రజలు ఎన్నో ఏండ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో సైడు కాలువలు లేకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై నిల్వవుతుందని విన్నవించారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా సరైన స్పందన లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కాలనీలో ఎక్కడ చూసినా కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. ముఖ్యంగా పవిత్ర



రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉండి మస్జీద్‌కు వెళ్లే సమయంలో గుంపులు గుంపులుగా పందులు తిరుగుతున్నాయని, మస్జీద్ ప్రాంగణంలోకి కూడా ప్రవేశిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలపైకి రావడం, కుక్కకాట్ల ఘటనలు పెరుగుతున్నాయని ప్రజలు పేర్కొన్నారు. ఇప్పటికే పలువురు కుక్కకాటుకు గురయ్యారని తెలిపారు. ఈ సమస్యలపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసి వెంటనే చర్యలు తీసుకునేలా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. సైడు కాలువలు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచే అంశంపై ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. అలాగే కాలనీలో తిరుగుతున్న కుక్కలు, పందుల సమస్యను తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తానని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, భద్రత ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని, ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పోలీసు –రెవిన్యూ అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక సమస్యల పై సంభంధిత అధికారుల తీరు మార్చుకొని ఇప్పటికైనా స్పందిస్తారా లేదా అనేది వేచిచూడాలి.

# పేదల సంక్షేమంకోసమే సూపర్ సిక్స్

### పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో చీఫ్ విప్ జీవీ
### ఏడాదికి 33 వేలకోట్లు ఖర్చుచేస్తున్నామని వెల్లడి
### గిరి ప్రదక్షణ రోడ్డుకు శంకుస్థాపన

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 28)

రాష్ట్రంలో ఉన్న పేదల ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ పట్టణంలోని 16వ వార్డులోని చౌడేశ్వరీమాత ఆలయ వీధిలో పింఛను లబ్ధి దారులకు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పింఛన్లు పంపిణీ లబ్ధి దారుల ఇళ్ళకు వెళ్ళి వారిని ఆప్యాయంగా పలకరించిన జీవీ ఆంజనేయులు ప్రతినెలా పింఛను అందుతున్న తీరు పై లబ్ధి దారులతో ముచ్చటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛన్లు పెంపుతో ఆయా కుటుంబాల్లో జరుగుతున్న లబ్ధిని పేదలు జీవీకి వివరించారు. పింఛన్ల పంపిణీ అనంతరం వినుకొండకు గిరి ప్రదక్షణ రోడ్డు పనులకు జీవీ ఆంజనేయులు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గిరి ప్రదక్షణ రోడ్డు ఏర్పాటుకు కాల వ్యవధి, రోడ్డు నిర్మాణ నాణ్యత, అంచనా వ్యయంపై అధికారులతో చర్చించారు. జీవీ ఆంజనేయులు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు పేద ప్రజలకు చేరుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 62 లక్షల మంది పింఛను లబ్ధి దారులకు నెలకు రూ.2,709 కోట్లు చొప్పున ఏటా రూ.33 వేల కోట్లు పింఛన్లకు ఖర్చుచేస్తున్నట్లు చెప్పారు. మహిళలకు ఉచితగ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, తల్లికి వందం వంటి పథకాలకు సుమారు రూ.70వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. మరో రెండు నెలల్లో అర్హులైన వారికి నూతన పెన్షన్లు పంపిణీ చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు.







**ముఖ్యమంత్రి చంద్రబాబు మాటల మనిషి కాదు...**

వినుకొండ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డయాలసిస్ యంత్రాలు సమకూర్చుతామని మాట ఇచ్చారని వారం గడవక ముందే జీవో విడుదలైందని, వినుకొండకు 5 డయాలసిస్ యంత్రాలు మంజూరయ్యాయని జీవీ వెల్లడించారు. ముఖ్యమంత్రి మాటల మనిషి కాదని, చేతల మనిషి అని ఈ సంఘటన రుజువు చేసిందన్నారు. వినుకొండ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దుతామని, పూర్ణోదయ స్కీమ్ పల్నాడు జిల్లాను కూడా చేర్చనున్నారని, తద్వారా రైతులు ఎకరాకు లక్ష రూపాయల వరకు ప్రభుత్వసాయం అందుతుందన్నారు. పల్నాడు జిల్లాలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల శాసనసభ్యులు, ఎంపీ, ఇన్ఛార్జి మంత్రితో సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించనున్నారని, పల్నాడుజిల్లా మహర్ధశకు ఈ సమావేశం ఎంతో దోహదం చేస్తుందన్నారు.

**ఆధ్యాత్మిక కేంద్రంగా వినుకొండ కొండను తీర్చిదిద్దుతా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**

వినుకొండ కొండపై వేంచేసియున్న శ్రీ రామలింగేశ్వరస్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు తాను కట్టుబడి ఉన్నానని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సహకారంతో కొండపై ఆలయ పునఃర్నిర్మాణం పూర్తి చేయటంతోపాటు, ఘాట్ రోడ్డు, గిరి ప్రదక్షణ రోడ్డు ఏర్పాటు చేసి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా వినుకొండ కొండను నిలబెడతామన్నారు. ప్రభుత్వం, భక్తుల సహకారంతో పనులన్నీ త్వరితగతిన పూర్తవుతాయని జీవీ ఆంజనేయులు ధీమా వ్యక్తం చేశారు. కొండపై నిత్య అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అమ్మ ఛారిటబుల్ ట్రస్టు గురువు శ్రీశ్రీశ్రీ జ్ఞాన ప్రసన్న స్వామిని జీవీ ఆంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు. గిరి ప్రదక్షణ, ఘాట్ రోడ్డు నిర్మాణం, ఆలయ పునఃనిర్మాణంలో సంకల్పం తీసుకొని, ఆయల కమిటీకి తగు సహకారం అందించాలని బాబాని జీవీ ఆంజనేయులు కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.








On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# రైతు సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్యం



## ఎమ్మెల్యే ఏలూరి
## రాజకీయాలకతీతంగా పంటను కొనుగోలు చేయాలి
## కోలలపూడిలో శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఏలూరి
## రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు
## జాయింట్ కలెక్టర్ భావన

**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఫిబ్రవరి 28)**

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని, శనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు భరోసా కల్పించిందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. శనివారం కోలలపూడి గ్రామంలో మార్క్‌ఫెడ్ మరియు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (ప్యాక్స్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా జాయింట్





కలెక్టర్ భావనతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రాజకీయాలకు తావులేదని, రాజకీయాలకతీతంగా ప్రతి రైతు పండించిన పంటను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పంటను కేంద్రాలకు తీసుకురావాలని రైతులను కోరారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రైతుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించిన ఆయన, అప్పట్లో శనగల కొనుగోలు సమయంలో రైతులను ఇబ్బందులకు గురిచేసి లక్షల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం మాత్రం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పారదర్శక విధానాలతో ముందుకెళ్తోందన్నారు. ప్రతి రైతుకు న్యాయం జరగాలనేదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

**మద్దతు ధరతో రైతులకు భరోసా...**

రబీ సీజన్ 2025-26కు సంబంధించి శనగలకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5,875గా నిర్ణయించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇది రైతులకు లాభసాటి ధరగా ఉండి ఆర్థికంగా ఉపశమనం కలిగిస్తుందన్నారు. కష్టాల్లో ఉన్న రైతును ఆదుకోవడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పుడూ ముందుంటారని, ఆ సంకల్పంలో భాగంగానే సమయానికి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని వివరించారు. రైతు పంట చేతికొచ్చిన వెంటనే ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించడం ఈ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులు పంట వేసిన దశ నుంచే ఈ-క్రాప్ నమోదు, పంట రిజిస్ట్రేషన్, సీఎం యాప్‌లో నమోదు వంటి ప్రక్రియల ద్వారా కొనుగోలు సులభతరం చేస్తున్నామని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.ప్రభుత్వం బాధ్యతగా శనగలు కొనుగోలు చేస్తోందని, అదే విధంగా పిఏసిఎస్ చైర్మన్లు, సభ్యులు కూడా బాధ్యతగా వ్యవహరించి రైతులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే సూచించారు.

**వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత...**

గత ప్రభుత్వ కాలంలో రైతుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించిన ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రైతు సంక్షేమానికి అనేక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. గిట్టుబాటు ధర, సమయానుకూల కొనుగోలు, పారదర్శక విధానాల ద్వారా రైతులకు మేలు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.

**రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు : జేసీ**

శనగల కొనుగోలులో రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత పిఏసిఎస్‌లపై ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ భావన అన్నారు. కొనుగోలు కేంద్రాలకు శనగలు తీసుకువచ్చే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఏడి రమేష్‌బాబు, జెడిఎ, ప్రత్యేక అధికారి లవన్న, తహసీల్దార్ ప్రశాంతి, పిఏసిఎస్ అధ్యక్షుడు తాటి నాగార్జున, పిఏసిఎస్ అధ్యక్షులు, సీఈఓలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

## వినుకొండ టైలర్ అసోసియేషన్‌కి 5 సెంట్లు స్థలం అందిస్తాం






**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 28)**

టైలర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు అన్నారు. ప్రపంచ టైలర్స్ డే సందర్భంగా వినుకొండ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవను ఏర్పాటు చేసిన సభకు చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలిత కుట్టుమిషన్ సృష్టికర్త ఎలియన్స్ హోవే చితపడానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ టైలర్లు అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. టైలర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళా టైలర్లకి కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి, ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వినుకొండ టైలర్స్ అసోసియేషన్ బిల్డింగ్ నిర్మాణానికి అవసరమైన ఐదు సెంట్లు స్థలాన్ని తప్పనిసరిగా అందిస్తానని, అంతేకాకుండా అసోసియేషన్ బిల్డింగ్ నిర్మాణానికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చీఫ్ విప్ జీవి వెల్లడించారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ నాయకులు, టైలర్లు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం

## మీసాల మురళీకృష్ణ యాదవ్





**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 28)**

పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మార్గదర్శకత్వంలో వినుకొండ నియోజకవర్గంలో సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలు అవుతున్నాయని ఆయన అన్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ భరోసా, పింఛన్ పంపిణీ, ఆర్థిక సహాయం వంటి పథకాలు పేదల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని వివరించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని మీసాల మురళీకృష్ణ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మోతడక వీరాచారి, యూనిట్ ఇన్చార్జ్ కుంట కోటిరెడ్డి తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు గుడిపూడి యేసురత్నం, సీనియర్ నాయకులు జక్కిరెడ్డి అబ్బిరెడ్డి, ఆళ్ల గురువారెడ్డి, బైలడుగు తులసారావు, మాదాల ఎలమంద, మద్దిరెడ్డి కేశవరెడ్డి, మద్దిరెడ్డి సుబ్బారెడ్డి, బూత్ కన్వీనర్ మక్కెళ్ళ వెంకట్రావు, సచివాలయ సిబ్బంది గ్రామంలో పర్యటిస్తూ పెన్షన్ దారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వాసవి స్కూల్ నందు ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం






**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 28)**

మార్కాపురం పట్టణంలో వాసవి స్కూల్ నందు ఘనంగా జాతీయసైన్స్ దినోత్సవాన్ని వినుత్నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యయులు కె రంగయ్య, ఏఓ కె రంజిత్, ఇంచార్జులు, ఉపాధ్యాయ బృందం, చిన్నారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి కె రంగరాజు ప్రసంగిస్తూ విజ్ఞానశాస్త్ర ప్రదర్శిన అనేది విధ్యార్థుల సృజనాత్మికత పరిశోధన నైపుణ్యాలను ప్రదర్శించే ఓ అద్భుతమైన వేదిక అన్నారు. ఇందువలన విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తి పెంపొందిస్తుంది, 1924లో భౌతిక శాస్త్రవేత్త సివి రామన్, రామన్ ఎఫెక్ట్ను కనుగొన్నందుకు గౌరవ సూచకంగా ఫిబ్రవరి 28న భారత దేశం అంతటా జాతీయసైన్స్ జరుపుకుంటారు. దీని వలన 1930 భౌతిక శాస్త్రంలో నోబెర్ బహుమతి లభించిందన్నారు. అదే విధంగా రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు 100కు పైగా పరికరాలు చేసి విద్యార్థులు ప్రసంగం, బోర్డుల ద్వారా వివరించారు. ఇంత చక్కగా తయారు చేసిన విద్యార్థులకు వారికి సలహాలు, సూచనలు అందించి కృషి చేసిన సైన్స్ బృందానికి కె రంగయ్య ప్రత్యేకంగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర మహిళా విభాగ్ వైస్ ప్రెసిడెంట్ గా కొండపల్లి దేవి



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 28)**

బద్వేల్ పట్టణంలోని ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలుగా, జిల్లా అధ్యక్షురాలుగా, స్టేట్ ఉపాధ్యక్షురాలుగా అనేక సంవత్సరాలుగా ప్రజలకు, ఆర్యవైశ్యులకు సేవలు అందించిన కొండపల్లి దేవి సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాస్ ఆదేశాల మేరకు బద్వేల్ కొండపల్లి దేవికి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ స్టేట్ మహిళ విభాగ్ వైస్ ప్రెసిడెంట్ గా ప్రకటించడంతో పట్టణంలోని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు, వ్యాపారస్తులు, వాసవి, వనిత క్లబ్ అవోప ఆర్యవైశ్య వర్తక సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి కమిటీ సభ్యులు, యువజన సంఘం, అవోప మహిళా విభాగ తో పాటు పట్టణ ప్రజలు పలువురు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఐవిఎఫ్ స్టేట్ మహిళా వైస్ ప్రెసిడెంట్ గా నియమితులైన కొండపల్లి దేవి మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలోని పలువురు ఆర్యవైశ్యులు తాము ఏ కార్యక్రమం చేసిన సహృదయంతో ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించడంతో తాము ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలుగా అనేక సేవా కార్యక్రమాలు అమ్మవారికి ఆభరణాలు, వెండి సామాగ్రితో పాటు ప్రతి దసరా ఉత్సవాలలో మహిళా మండలి కమిటీ సభ్యులు భక్తులకు దర్శనాన్ని కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేపట్టడం జరిగిందన్నారు. తమ సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షురాలుగా, స్టేట్ ఉపాధ్యక్షురాలుగా, కూడా గత కొన్ని సంవత్సరాలు సేవ చేయడం జరిగిందన్నారు. అయితే ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ స్టేట్ మహిళ విభాగ్ వైస్ ప్రెసిడెంట్‌గా మరోసారి తనకు అవకాశం కల్పించడం జరిగిందని, రాష్ట్రస్థాయిలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించే విధంగా ఆర్యవైశ్యులకు ఎప్పుడు అందుబాటులో ఉంటామన్నారు. తమకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుండా సుప్రజ, జిల్లా అధ్యక్షురాలు కోట జ్యోతి, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు నాయకులకు పలువురికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు,ఈ పదవి నాకు రావడం మరింత బాధ్యత పెంచింది అన్నారు. శనివారం సాయంత్రం పలువురు కొండపల్లి దేవికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.